క్లుప్తంగా

ఘనంగా వీరభద్రుని సంబరం



వీరభద్రుని సంబరంలో చిన్నారులు

వీరవాసరం: రాయకుదురులో వేంచేసియున్న వీరభద్రేశ్వర స్వామి సంబరం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం చిన్న పిల్లలను బాల దాసులుగా అలంకరించి శివాలయం ఎదురుగా అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించి వీరభద్ర దండకాన్ని పఠించారు. పలు రకాల వేషధారణలతో రెండు ఎడ్లబండ్ల మీద గ్రామోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించి తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఉత్సవ నిర్వాహకులు తెలిపారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణోత్సవం



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

ఆకివీడు: స్థానిక ఆనాల చెరువు వద్ద వేంచేసియున్న వల్లీ దేవ సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ పునఃప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం మహాన్యాస పూర్వక ఏకా వారాభిషేకం, విశేష అర్చన, శాంతి కల్యాణం నిర్వహించారు. సాయంత్రం ఏకాంత సేవ చేశారు.

నిత్యాన్నదానానికి విరాళం



నిత్యాన్నదానానికి విరాళం అందిస్తున్న దాత

భీమవరం (ప్రకాశంచౌక్): గునుపూడిలో వేంచేసియున్న పంచారామక్షేత్రం సోమేశ్వర జనార్ధన స్వామి వార్ల దేవస్థానంలో నిత్యాన్నదానానికి అచ్చం వెంకటేశ్వరరావు రూ.2,00,115 విరాళంగా అందజేశారు. ఈ మేరకు దాతకు ఈఓ డి.కృష్ణంరాజు అభినందనలు తెలిపారు. ముందుగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

డిజిటల్ చెల్లింపులపై అవగాహన



కరపత్రాలను ప్రదర్శిస్తున్న ఎస్సై నాగరాజు

ఆకివీడు: ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్సై హనుమంతు నాగరాజు పిలుపునిచ్చారు. స్థానిక ధర్మాపుర అగ్రహారంలో సోమవారం డిజిటల్ చెల్లింపులు, నగదు రహిత చెల్లింపులపై అవగాహనా కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930కి ఫోన్ చేయాలన్నారు. కార్యక్రమంలో వి.ఆంజనేయులు, వి.అశోక్ కుమార్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

వీరవాసరం: రాయకుదురులో అగ్ని ప్రమాద బాధితులైన తోట రాంపండు కుటుంబానికి సోమవారం పాలకొల్లుకు చెందిన మండల రాంప్రసాద్ కేఎల్ శ్రీనివాస్, కూనపరెడ్డి లక్ష్మణ స్వామి, అధికారి శాలిం రెండు బస్తాల బియ్యం, బట్టలు, నిత్యావసర సరుకులు అందజేశారు. రాయకుదురు గ్రామానికి చెందిన నార్కెడమిల్లి ప్రవీణ్ మిత్ర బృందం రూ.30,000 విలువగల మంచం, పరుపు, ఫ్యాన్లను అందజేశారు. వీరికి గ్రామస్తులు ధన్యవాదాలు తెలియజేశారు.

వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీ సస్పెన్షన్

భీమవరం (ప్రకాశంచౌక్): స్థానిక 26 వార్డు సచివాలయ ఎడ్యుకేషన్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ పి.కమల్‌కుమార్‌ను సస్పెండ్ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ కె.రామచందర్ రెడ్డి తెలిపారు. ఆస్తి పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం, బయోమెట్రిక్ హాజరు వేయడంలో సమయపాలన పాటించకపోవడంపై నోడల్ ఆఫీసర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేసి, కమల్‌కుమార్‌ను సస్పెండ్ చేసినట్టు ఆయన తెలిపార

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

భీమవరం: రెండో పట్టణంలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న బొండాడకు చెందిన కె.వేణుగోపాలరావును మరో ద్విచక్ర వాహన చోదకుడు వేగంగా ఢీకొట్టాడు. ఆదివారం రాత్రి జరిగిన ఈ సంఘటనలో వేణుగోపాలరావు తలకు తీవ్ర గాయమైంది. ప్రస్తుతం పట్టణంలోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎస్సై ఇజ్రాయేల్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పడకేసిన డాలర్ల పంట

- దయనీయ స్థితిలో రొయ్యల సాగు
- ఓ పక్క వైరస్.. మరో పక్క దళారులు
- సీడ్ దగ్గర నుంచి కొనుగోలు వరకూ దగానే
- మేతల మతలబు.. లబోదిబోమంటున్న రైతులు
- సబ్సిడీలు లేవు.. రాయితీలు ఉండవు



రొయ్యల చెరువు



వైరస్‌తో పట్టుబడి పట్టిన రొయ్యలు

ఆకివీడు: దయనీయ స్థితిలో డాలర్ల పంట ఉంది. నీలి విప్లవంపై కారుమబ్బులు కమ్ముకున్నాయి. దళారుల దగాతో రొయ్య రైతులు విలవిలలాడుతున్నారు. సిండికేట్లతో నిలువు దోపిడీకి గురవుతున్నారు. గత మూడు దశాబ్దాలుగా రొయ్యల సాగుతో ప్రభుత్వం వేలాది కోట్ల విదేశీ మారకద్రవ్యం పొందుతున్నప్పటికీ రైతులను ఆదుకుంటున్న దాఖలాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. అన్నపూర్ణగా పేరొందిన ఉండి నియోజకవర్గంలో వరి సాగును వదిలి రైతన్నలు ఆక్వా సాగుపై దృష్టి పెట్టారు. అంచెలంచెలుగా నియోజకవర్గంలో సుమారు 43,600 ఎకరాల్లో రొయ్యల సాగును చేపడుతున్నారు. 100 కౌంట్ రొయ్య పెంపకానికి రూ.245 ఖర్చు అవుతుంటే, ధర మాత్రం రూ.210 ఉంది. ఈ విధమైన ధరలతో రొయ్యల పెంపకం కత్తి మీద సామే. కరెంట్ చార్జీలు తగ్గిస్తామని ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినా, అధికారంలోకి వచ్చిన తరువాత యూనిట్ ధర రూ.4.00 వసూలు చేస్తుంది. ఎన్నికల హామీ మేరకు యూనిట్ రూ.1.60 పైసలకు అందించాలి. సబ్సిడీపై ట్రాన్స్‌ఫార్మర్ల ఊసే లేదని రైతులు వాపోతున్నారు.

ఆకాశానంటుతున్న మేత ధరలు

రొయ్యల మేత ధరలు రోజు రోజుకూ పెరుగుతూ ఆకాశాన్నంటుతున్నాయి. గత రెండు మూడు సంవత్సరాల్లో మేత ధరలు భారీగా పెరిగాయి. టన్నుకు రూ.20 వేలు పైబడి పెరిగిపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తూకాల్లో తేడాలొచ్చినా రైతులు నష్టాలను భరించాలి.

నియోజకవర్గంలో ఆక్వా సాగు (ఎకరాల్లో)

ఆకివీడు	8,500
ఉండి	11,200
కాళ్ల	17,500
పాలకోడేరు	6,400

సిండికేట్లతో ఇబ్బంది



సిండికేటు వల్లే ఆక్వా రంగం ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతుంది. రొయ్యల కొనుగోలు, ఎగుమతులు, మేత ఉత్పత్తులు ఒకే సామాజిక వర్గం చేతుల్లో ఉన్నాయి. ధరలను నియంత్రించే వారు లేరు. వైఎస్సార్‌సీపీ హయాంలో మేత ధరలను నియంత్రించి సబ్ కమిటీకి తెలియజేసే విధానం తీసుకొచ్చారు. విద్యుత్ సబ్సిడీలు లభించాయి.

–నంద్యాల సీతారామయ్య, ఆక్వా రైతు, కుప్పనపూడి

ఆక్వా రైతులను ఆదుకోవాలి



ఆక్వా రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. లేని పక్షంలో రైతులు ఐక్యంగా పోరాడుతాం. బంగారం, పుస్తెలు తాకట్టు పెట్టి ఆక్వా సాగు చేస్తున్నాం. మేతలు, విద్యుత్ చార్జీల ధరలు తగ్గించి, రొయ్యల ధరలు స్థిరీకరించాలి.

–మద్రివాడ వెంకట్రావు, ఆక్వా రైతు, చినకాపవరం

సబ్సిడీపై ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వాలి



ఆక్వా రైతులకు సబ్సిడీపై ట్రాన్స్‌ఫార్మర్లు అందించాలి. నూతన మార్కెట్లను అన్వేషించాలి. ఆక్వా రైతులను ప్రోత్సహిస్తే మరింత విదేశీ మారకద్రవ్యం లభిస్తుంది. కోల్డ్ స్టోరేజీలను ఏర్పాటు చేసి రైతులకు పెట్టుబడిపై రెండింతల ధర లభించే విధంగా చర్యలు తీసుకోవాలి.

– పిల్లా నర్సింహరావు, ఆక్వా రైతు, మాదివాడ

కూటమి ప్రభుత్వంలో ఆక్వా రంగం కుదేలు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కాళ్ల: ఒకే కమ్యూనిటీకి చెందిన వారి చేతిలో ఆక్వా రంగం కుదేలవుతుందని, తద్వారా రైతులు తీవ్రంగా నష్టపోయి ఇబ్బందులు పడుతున్నారని వైఎస్సార్‌సీపీ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. పెదఅమిరం పార్టీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పెన్మెత్స దుర్గాప్రసాదరాజు మాట్లాడుతూ వనామీ రేట్ల పరిస్థితి నేడు అధ్వానంగా ఉందని వాపోయారు. వనామీ మేతల ఉత్పత్తిదారులు ఒకే కమ్యూనిటీ చెందిన వారు కావడంతో వారికి ప్రభుత్వ పెద్దల అండతో సిండికేటుగా మారి ధరలను మాత్రం తగ్గించడం లేదు. దీంతో ఆక్వా రైతులు కుదేలవుతున్నారని, ప్రభుత్వం స్పందించి వనామీ రొయ్యలకు రేట్లు పెంచి ఫీడ్ రేట్లు తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆకివీడు మండల పార్టీ అధ్యక్షుడు నంద్యాల సీతారామయ్య మాట్లాడుతూ పది రోజులుగా వనామీ రైతులు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ట్రెజరర్ వేగేశ్న జయ రామకృష్ణంరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆక్వా రైతులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. గత ప్రభుత్వంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు ఎంతో మంచి చేశారని గుర్తు చేశారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఉండి: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి యండగండి విద్యుత్ సబ్‌స్టేషన్‌కు వెళ్లే విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం మంగళవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు తెలిపారు. దీని కారణంగా యండగండి సబ్‌స్టేషన్ పరిధిలోని యండగండి, ఉణుదుర్రు, చిలుకూరు, వెలివర్రు గ్రామాల్లో ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని గృహ వినియోగదారులు, ఆక్వా రైతులు గమనించాలని ఆయన తెలిపారు.

నేడు, రేపు విద్యుత్ కోత

ఆకివీడు: పట్టణంలోని సబ్ స్టేషన్ పరిధిలోని మరమ్మతుల నిమిత్తం మంగళవారం, బుధవారం మధ్యాహ్నం ఒంటి గంట నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ ఎస్.వెంకటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆకివీడు, అజ్జమూరులోని ఫీడర్లలో సరఫరా ఉండదన్నారు. వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

జాబ్‌మేళాలో 11 మందికి ఉద్యోగాలు

వీరవాసరం: ఈ నెల 8, 9 తేదీల్లో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో వీరవాసరం ఎస్ఎంబీటీ ఏవీ అండ్ ఎస్ఎన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు సుమారు 32 మంది పాల్గొనగా 11 మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ వలవల నరసింహారావు సోమవారం తెలిపారు. కొలువులు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వద్దినీడి సత్యనారాయణ మాట్లాడుతూ మా కళాశాలలో కమ్యూనికేషన్ స్కిల్స్‌కు, ఆంగ్లంపై పట్టు కోసం ప్రత్యేక తరగతులు నిర్వహించడం వలన విద్యార్థులు ఉద్యోగాలు పొందుతున్నారని చెప్పారు. కార్యక్రమంలో అధ్యాపకులు, ప్లేస్‌మెంట్ అధికారి వి.దుర్గాప్రసాద్, ట్రైనింగ్ ఆఫీసర్ అద్దంకి మీనా పాల్గొన్నారు.

సాగు, తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు

మండల పరిషత్ సమావేశంలో తీర్మానం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని

వీరవాసరం: వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని సాగునీరు, తాగునీరు ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మండల పరిషత్ సమావేశంలో తీర్మానించారు. వీరవాసరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. సమావేశంలో టీడీపీ, జనసేన ఎంపీటీసీల మధ్య విభేదాలు బట్టబయలయ్యాయి. నిధుల కేటాయింపు విషయంలో పక్షపాతం చూపుతున్నారని ఈ సందర్భంగా పలువురు సభ్యులు నిలదీయడం చర్చనీయాంశమైంది. మండలంలోని మంచినీటి చెరువులను పూర్తి స్థాయిలో నింపాలని, ఎన్ఆర్ఈజీఎస్ నిధుల ద్వారా పంట బోదెలు, కాలవలు ప్రక్షాళన, కార్యక్రమాలు నిర్వహించాలని పలు తీర్మానాలను ఆమోదించారు. సమావేశంలో ఎంపీడీవో బిరుదుకోట అప్పారావు, తాహసిల్దార్ ఏవి రామాంజనేయులు, వైస్ ఎంపీపీ అడ్డాల శ్రీరామచంద్రమూర్తి ,వీరవల్లి కుసుమ కుమారి, బోను జోష్నాదేవి, పంజా మంగతాయారు, గెద్దం భారతి, ఎంపీటీసీలు, సర్పంచులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు రెండు దరఖాస్తులు



కరకోడు పుంతరోడ్డులో మందుబాబులు వదిలేసిన మద్యం సీసాలు

ఆకివీడు: మండలంలోని సిద్ధాపురం గ్రామంలోని కరకోడు పుంత రోడ్డులో మందు బాబులు స్వైర విహారం చేసి మద్యం బాటిళ్లను ధ్వంసం చేసి తీవ్ర ఇబ్బందికి గురి చేస్తున్నారని ఆ ప్రాంత రైతులు ప్రజా వేదికలో ఫిర్యాదు చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ప్రజా వేదిక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో రెండు ఫిర్యాదులు అందాయి. సిద్ధాపురం గ్రామానికి చెందిన అల్లూరి సోమరాజు కరకోడు ఆయకట్టు భూముల్లోకి వెళ్లే రైతులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని, గాజు పెంకులు గుచ్చుకుని ఆసుపత్రుల పాలవుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్థానిక నగర పంచాయతీలోని సర్వే నంబర్ 485లో నివాసం ఉంటున్నామని, ఆ ప్రాంతంలోని 45 మందికి పట్టాలు ఇచ్చారని, తనకు పట్టా ఇచ్చినా ఇల్లు కట్టుకునే స్థితిలో లేనందున ప్రభుత్వం ఇల్లు నిర్మించుకునేందుకు సహకరించాలని ఎ.సతీష్‌కుమార్ దరఖాస్తు చేసినట్లు ఎంపీడీఓ సుహాసిని చెప్పారు. రెండు దరఖాస్తులను ఆయా శాఖలకు పంపినట్లు తెలిపారు.

క్రికెట్ చాంపియన్స్ ట్రోఫీ గెలుపుపై సంబరాలు



భారత క్రికెట్ జట్టుకు అభినందనలు తెలుపుతున్న అభిమానులు

భీమవరం: క్రికెట్ చాంపియన్స్ ట్రోఫీ విజేతగా నిలిచిన భారత్ జట్టును అభినందిస్తూ సోమవారం విజయోత్సవ సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎన్నార్ కళాశాల సెక్రటరీ గాదిరాజు సత్యనారాయణరాజు (బాబు), ఉపాధ్యక్షుడు గోకరాజు పాండురంగరాజు మాట్లాడుతూ క్రికెట్‌లో అత్యుత్తమ ప్రదర్శనతో మన క్రికెటర్లు చాంపియన్ ట్రోఫీతో పాటు 140 కోట్ల ప్రజల హృదయాలను గెలుచుకున్నారన్నారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ప్రపంచంలో క్రికెట్ మొదటి స్థానంలోనే ఉందని దుబాయ్‌లో నిర్వహించిన చాంపియన్ ట్రోఫీలో భారత్ విజయం సాధించడం భారతీయులందరికీ గర్వకారణమన్నారు. కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ బీవీ నర్సింహరాజు, పీవీ నర్సింహా రాజు, డి దుర్గారావు, జిడి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు ఆదర్శం సావిత్రిబాయి పూలే



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న సేవా సంస్థ ప్రతినిధులు

భీమవరం: భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయిని, సంఘ సంస్కర్త, సావిత్రిబాయి పూలే వర్ధంతిని విజ్ఞాన వేదిక సేవా సంస్థ ఆధ్వర్యంలో భీమవరం పట్టణంలోని పొట్టి శ్రీరాములు మున్సిపల్ గరల్స్ హైస్కూల్‌లో సోమవారం నిర్వహించారు. ముందుగా సావిత్రబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి అనంతరం అరసవల్లి ఈశ్వరమ్మ, వీర వెంకటాచారి చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు అరసవల్లి సుబ్రహ్మణ్యం, సీపీఐ నాయకుడు ఎం సీతారాంప్రసాద్, కొల్లి శ్రీనివాసరావు మాట్లాడారు. కార్యక్రమంలో అల్లు శ్రీనివాస్, స్కూల్ హెచ్ఎం వారణాసి రాధాకృష్ణ, చాన్ బాషా, అడబాలశివ, దారపురెడ్డి విక్రమ్, సునీత తదితరులు పాల్గొన్నారు.

‘యువత పోరు’ విజయవంతం చేయాలి



భీమవరం: యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



కాళ్ల: పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నరసాపురం పార్లమెంట్ కన్వీనర్ గూడూరి ఉమాబాల

భీమవరం: నిరుద్యోగ యువత, విద్యార్థులకు కూటమి ప్రభుత్వం చేసిన మోసాన్ని ఎండగడుతూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన భీమవరంలో నిర్వహించే యువత పోరు కార్యక్రమానికి ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నరసాపురం పార్లమెంట్ కన్వీనర్ గూడూరి ఉమాబాల, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు కోడే విజయలక్ష్మి, పార్టీ జిల్లా అధికార ప్రతినిధి కామన నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. సోమవారం పార్టీ పట్టణ అధ్యక్షుడు గాదిరాజు రామరాజు నివాసరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో యువత పోరు పోస్టర్ ఆవిష్కరణ అనంతరం మాట్లాడారు. టీడీపీ, జన సేన, బీజేపీ అధికారంలోనికి వచ్చాక అన్నివర్గాలను తీవ్రంగా మోసం చేసిందని ప్రధానంగా నిరుద్యోగులకు ఇస్తామన్న నిరుద్యోగభృతి, తల్లిదీనెన పథకాల ఊసే ఎత్తడం లేదని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఏఎస్ రాజు, చిగురుపాటి సందీప్, చవ్వాకులు సత్యనారాయణ, జల్లా కొండయ్య, డీవీడీ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

కాళ్ల: ఈ నెల 12వ తేదీన విద్యార్థులు, నిరుద్యోగుల పక్షాన నిలుస్తూ చంద్రబాబు సర్కారుపై వైసీపీ చేపట్టిన యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పెన్మెత్స దుర్గాప్రసాదరాజు పిలుపునిచ్చారు. కాళ్ల మండలం పెదఅమిరంలోని జిల్లా కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం త్రైమాసికాలుగా ఫీజు రియంబర్స్‌మెంట్ ఇవ్వవలసిన రూ .4,600 కోట్ల బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గణేశ్న రాంబాబు, నంద్యాల సీతారామయ్య, వేగేశ్న జయ రామకృష్ణంరాజు, జి.ధనుంజయ్, కరిమేరకు నాగరాజు, గుండు నాగేశ్వరరావు, పెనుమత్స రంగరాజు, వేగేశ్న నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ వైఖరితో రైతులకు నష్టం



ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్

వీరవాసరం: ఈ నెల 12న యువత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. వీరవాసరం మండలం నవుడూరు జంక్షన్‌లో సోమవారం పాత్రికేయుల సమావేశంలో పాల్గొని ఆయన మాట్లాడారు. లక్షలాది మంది విద్యార్థులు, యువతను నిలువునా మోసగించిన కూటమి ప్రభుత్వంపై వారి పక్షాన శాంతియుతంగా వైఎస్సార్‌సీపీ ఈ కార్యక్రమం చేపడుతుందన్నారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ఇప్పటికే పలు జిల్లాల్లో వైఎస్సార్ సీపీ చేపట్టిన కార్యక్రమాలు విజయవంతమయ్యాయన్నారు. అంతేకాక పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకుని గ్రామాల నుంచి వైఎస్సార్‌సీపీ జెండా ఎగురవేయాలని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ తెలిపారు.

దివ్యాంగుడి చెంతకు జాయింట్ కలెక్టర్



దివ్యాంగుడి చెంతకు వచ్చి సమస్య తెలుసుకుంటున్న జేసీ రాహుల్ కుమార్‌రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): చాలా రోజుల తరువాత ప్రారంభమైన పీజీఆర్ఎస్ కార్యక్రమంతో కలెక్టరేట్ హడావుడిగా ఉన్న సమయంలో దివ్యాంగుడు వీవీఎస్ వేణుగోపాల్ అర్జీ నిమిత్తం కలెక్టరేట్‌కు వచ్చి కారులోనే ఉండిపోయాడు. పరిస్థితిని అర్థం చేసుకున్న జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్‌రెడ్డి ఆ దివ్యాంగుడి చెంతకు వెళ్లి అర్జీ స్వీకరించారు. ఆకివీడుకు చెందిన వీవీఎస్ వేణుగోపాల్ 2014లో యాక్సిడెంట్ అయ్యి రెండు కాళ్లు చచ్చుబడిపోయాయి. దీంతో ప్రభుత్వం అందిస్తున్న రూ.6 వేల పెన్షన్ పొందుతున్నాడు. కుటుంబానికి నేనే ఆధారమని, ప్రభుత్వం అందజేస్తున్న రూ.6 వేలు నా వైద్యానికే సరిపోతున్నాయని, కుటుంబ పోషణ కష్టంగా ఉందని, తనకు మెడికల్ డిపార్ట్‌మెంట్ ద్వారా మంజూరు చేసే రూ.15 వేల పెన్షన్‌కు పరిశీలించాలని జేసీకి విన్నవించాడు. దీనిపై జేసీ టి.రాహుల్ కుమార్‌రెడ్డి స్పందిస్తూ పింఛన్ పునః పరిశీలన కారణంగా ఆన్‌లైన్ సైట్‌ను తాత్కాలికంగా నిలుపుదల చేశారని, తిరిగి ప్రారంభించిన వెంటనే మీ అర్జీని పరిశీలిస్తానని అర్జీదారుడికి తెలిపారు.

గ్రంథాలయాల సెస్ బకాయిలు జమ చేయాలి

భీమవరం: జిల్లా గ్రంథాలయ సంస్థకు చెల్లించాల్సిన సెస్ బకాయిలు సుమారు రూ.3 కోట్లు విడుదల చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగుల సంఘం ఉపాధ్యక్షుడు పామర్తి రంగారావు, ప్రధాన కార్యదర్శి ఎండి జుల్ఫికర్ ఆలీ జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంగారావు, జుల్ఫికర్ ఆలీ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామ పంచాయతీలు ఆస్తి పన్ను నుంచి రూ.1కి ఎనిమిది పైసలు చొప్పున గ్రంథాలయ పన్ను వసూలు చేస్తున్న మొత్తాన్ని ఎప్పటికప్పుడు జిల్లా గ్రంథాలయ సంస్థల నిధులకు జమ చేయకపోవడంతో సిబ్బంది జీతాలు, పింఛన్లు చెల్లించే అవకాశం ఉండదని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రంథాలయాల నిర్వహణకు అవసరమయ్యే నిధులు లేక అభివృద్ధి కుంటు పడుతుందన్నారు. దీనిపై జిల్లా అధికారులు స్పందించి గ్రంథాలయాలకు నిధులు జమ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు.

నీటి నమూనాల సేకరణ

వీరవాసరం: జాతీయ హరిత ట్రిబ్యునల్, చెన్నై వారి ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి అధికారులు సోమవారం పాలకోడేరు మండలం శృంగవృక్షం, వీరవాసరం మండలం దూసనపూడి గ్రామంలో 18 గ్రామాలకు ప్రవహించే అడవి కోడు, ముత్యంకోడు పంట కాలువల కాలుష్యానికి సంబంధించి పలు పంట కాలువలు, బోదెలలో నీటి నమూనాలు సేకరించారు. నీటి నమూనాలను విశాఖపట్నంలోని ల్యాబ్‌కు పంపిస్తామని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు గ్రేడ్ ఎనలిస్ట్ ఎస్.ఈశ్వరి, ఏఈ ఎస్.రమేష్ తెలిపారు. తోట గంగరాజు, జక్కంపూడి సతీష్, తిరుమల వాసు, కుర్రెళ్ల సదానందం, యర్రంశెట్టి సాయి, కుర్రెళ్ల త్రిమూర్తులు పాల్గొన్నారు.